## క్లుప్తంగా

### చెస్ చాంపియన్‌షిప్‌లో కార్తీక్‌కు స్వర్ణం



విజయవాడ స్పోర్ట్స్: రెండో ఏషియన్ చెస్ ఫర్ ప్లేయర్స్ విత్ డిజేబుల్డ్ చాంపియన్‌షిప్‌లో విజయవాడకు చెందిన ఫిడే మాస్టర్ వెంకటకృష్ణకార్తీక్ సత్తా చాటాడు. కిరికిస్తాన్ దేశంలో ఈ నెల 10న ప్రారంభమైన పోటీలు సోమవారం ముగిశాయి. ఏడు దేశాల క్రీడాకారుల పాల్గొన్న ఈ పోటీల్లో కార్తీక్ విశేష క్రీడా నైపుణ్యంతో ఆరు పాయింట్లు సాధించి గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకున్నాడు. కార్తీక్ కొన్నేళ్లుగా నగరంలోని గ్లోబల్ చెస్ అకాడమీలో అంతర్జాతీయ కోచ్ షేక్ ఖాసీం వద్ద శిక్షణ పొందుతున్నాడు.

### అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సోమవారం ప్రదర్శించిన కూచిపూడి నృత్యప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై ఎ.బిందు యోషిత, సీహెచ్.హేమశ్రీ, కె.ఝాన్సీలక్ష్మి, తేజశ్రీ, ఎం.జయ చైత్రిక, వినీల వర్షిణి పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం నృత్యప్రదర్శన ఇచ్చిన చిన్నారులకు ఆలయ డీఈవో రత్నరాజు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

**ఆకట్టుకున్న శ్రీకృష్ణ రాయబారం**

ఇంద్రకీలాద్రిపై ధర్మపథం వేదికపై పల్నాడు జిల్లా క్రోసూరు మండలం హసనాబాద్‌కు చెందిన కాశీ విశ్వేశ్వర సాంస్కృతిక సేవా సంస్థ ప్రదర్శించిన శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక పద్య నాటకం భక్తులకు ఆకట్టుకుంది. చింతలపాటి శూలపాణి బృందం నాటకాన్ని ప్రదర్శించారు. ఆద్యంతం ఎంతో ఆసక్తిగా సాగిన నాటకాన్ని వీక్షించిన భక్తులు కళాకారులను అభినందించారు. ఆలయ ఈవో, డీఈవోలు కళాకారులను అభినందించి, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

### రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ



లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ నిధులు రూ.45 లక్షలతో బీటీరోడ్డు నిర్మాణ పనులకు సోమవారం 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెడ్‌సర్కిల్ నుంచి పుష్పా హోటల్ మీదుగా నైస్‌బార్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కౌన్సిల్‌లో తీర్మానం పెట్టామన్నారు. నిధులు మంజూరు చేయడంతో ప్రస్తుతం పనులు ప్రారంభించామన్నారు. తాను కార్పొరేటర్‌కు ఎన్నికైన తర్వాత ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, డివిజన్‌లో దాదాపు రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట సెక్షన్, అలంకార్ విద్యుత్ ఉపకేంద్రం 11 కేవీ కోసల హోటల్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు తెలిపారు. చందనా బ్రదర్స్ రోడ్డు, కోసల హోటల్ రోడ్డు, ముద్దా సుబ్బయ్య వీధి, స్వర్ణ కాంప్లెక్స్, కాశేశ్వరరావు రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

**మధురానగర్ పరిధిలో..**

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా మధురానగర్ సెక్షన్ పరిధిలో ఎస్‌వీఎస్ టెంపుల్ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ పి. రవీంద్రబాబు తెలిపారు. రామకృష్ణాపురం ఒకటి, రెండోలైను, మసీదు రోడ్డు, నెమలికంటి సీతాదేవి వీధి, వెంకటేశ్వర స్వామి టెంపుల్ వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

### సృజనాత్మకతే విజయానికి సోపానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సృజనాత్మకతతో ముందుకు సాగినప్పుడు తప్పకుండా విజయాలు వరిస్తాయని యూనివర్సిటీ ఆఫ్ పాండిచ్చేరీ ప్రొఫెసర్, స్టార్టప్ నిపుణుడు ప్రొఫెసర్ భూషణ్ డి.సుధాకర్ అన్నారు. ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సహకారంతో కేబీఎన్ కళాశాల కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యాన సోమవారం 'స్టార్టప్స్ – ఎ న్యూ ఇన్నోవేటివ్ బిజినెస్ వెంచర్' అంశంపై అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు.

# సింగ్‌నగర్ రైతుబజార్ రూటే సెప'రేటు'!

- బోర్డులో నిర్ణయించిన ధరల కన్నా ఎక్కువ రేట్లకు అమ్మకం
- నాసిరకం కూరగాయల విక్రయం.. ప్రశ్నిస్తే వినియోగదారులపై తిట్ల పురాణం
- 'పక్కదారి' పడుతున్న నాణ్యమైన కూరగాయలు
- అ'ధన'పు బాధ్యతల పేరుతో కానరాని ఈఓ..
- ఫిర్యాదులు అందుతున్నా చర్యలు శూన్యం




సింగ్‌నగర్ రైతుబజార్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ రైతుబజార్‌లో ఏ కూరగాయలు కొనాలన్నా కేజీకి 2 నుంచి 5 రూపాయలు అదనంగా చెల్లించాల్సిందే.. కూరగాయలు పుచ్చిపోయినా.. పాడైపోయినా.. తీసుకొని వెళ్లాల్సిందే. అధిక ధరలేంటని అడిగినా.. పాడైనవి మార్చి మంచివి ఇవ్వమన్నా.. కాటా సరిగా వేయమన్నా.. ఇక వారిపై బూతు పురాణాలు.. గొడవలకు దిగాల్సిందే.... ఇదీ సింగ్‌నగర్ రైతుబజార్‌లో జరుగుతున్న వ్యాపారాల తీరు. రైతుబజార్‌కు చెందిన ఈఓ కూడా అ'ధన'పు బాధ్యతల సాకుతో సక్రమంగా అందుబాటులో ఉండకపోవడంతో ఇక ఇక్కడి కొంతమంది వ్యాపారులు ఇష్టారాజ్యంగా నడుచుకుంటున్నారు. అధిక ధరలు చెల్లిస్తున్నామని.. నాణ్యమైన కూరగాయలు ఇవ్వడం లేదని ఫిర్యాదులు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

**నిత్యం గొడవలే..**

రైతుబజార్‌లో కొంతమంది వ్యాపారులు తమకు కేటాయించిన ధరల కన్నా అధిక ధరలకు కూరగాయలను విక్రయిస్తున్నారు. దీంతో వ్యాపారులు, వినియోగదారుల మధ్య నిత్యం ఇక్కడ గొడవలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. అలానే మరికొంత మంది నాసిరకం కూరగాయలు, పాడైపోయినవి, కుళ్లిపోయినవి కూడా కాటాలో వేసేసి ఇస్తున్నారు.. పాడైపోయినవి మాకెందుకు మంచివి ఇవ్వమని అడుగుతుంటే వాటిని మరి మేము ఏమి చేసుకోవాలి.. అన్ని వస్తాయి.. నచ్చితే తీసుకోండి.. లేదంటే పోండి.. అంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

**నడిచే దారి లేకుండా ఆక్రమణలు**

రైతుబజార్‌లో తమకు కేటాయించిన దుకాణాలను దాటి నడిచే మార్గంలో కూడా కొంతమంది కూరగాయలను సర్దేస్తున్నారు. నడవడానికి కూడా వీలు లేకుండా పెట్టడమే కాకుండా.. అటుగా వెళ్లే వారు వాటిని చూడకుండా పొరపాటున వాటికి తగిలారా వారిపై కూడా గొడవలకు దిగడం చేస్తున్నారు.

**ప్రైవేట్ దుకాణాల్లో కొనుగోలు**

రైతుబజార్‌కు వస్తున్న నాణ్యమైన కూరగాయలను కొంతమంది వ్యాపారులు 'పక్కదారి'న అధిక ధరలకు విక్రయిచ్చేస్తున్నారు. సింగ్‌నగర్ ఫ్లై ఓవర్‌కు ఓ వైపు రైతుబజార్ ఉండగా మరో వైపు ప్రైవేటు వ్యక్తుల కూరగాయల దుకాణాలు ఉన్నాయి. దీంతో రైతుబజార్‌కు వచ్చే నాణ్యమైన కూరగాయలన్నిటిని ఆ పక్కదారిలో దుకాణాలకు పంపేసి.. నాసిరకమైనవి రైతుబజార్‌లో విక్రయిస్తున్నారని స్థానిక ప్రజలు, వినియోగదారులు ఆరోపిస్తున్నారు. దీంతో ఇక్కడి రైతుబజార్‌లో నాసిరకం కూరగాయలు కొనుక్కోవడం కన్నా ధరల భారం అయినా పక్కనున్న ప్రైవేటు దుకాణాల్లోనే నాణ్యమైన కూరగాయలు కొనుక్కోవచ్చని అటుగా వెళ్లిపోతున్నారు.

**నిలువు దోపిడీ..**

సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, నందమూరినగర్, ఇందిరానాయక్‌నగర్, వాంబేకాలనీ ప్రాంతాల్లోని సుమారు 50 నుంచి 80 వేల మంది వినియోగదారులు ఈ రైతుబజార్‌పై ఆధారపడి ఉంటారు. వారానికి సరిపడా కూరగాయలను ఇక్కడే కొనుగోలు చేసి వెళ్తూ ఉంటారు. దీంతో సింగ్‌నగర్ రైతుబజార్ నిత్యం వినియోగదారులతో కళకళలాడుతూ ఉండేది. అయితే గత కొంతకాలంగా ఈ రైతుబజార్‌లో కూరగాయలు నాణ్యమైనవి లేకపోవడం, అధిక ధరలు తీసుకోవడం, ఇష్టం వచ్చినట్లు కొంతమంది వ్యాపారులు మాట్లాడుతుండడంతో ప్రస్తుతం ఇక్కడ వ్యాపారాలు పడిపోయాయి.

రైతుబజార్‌లో అవకతవకలను ఎప్పటికప్పుడు పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత ఈఓ సరిగా అందుబాటులో లేకపోవడం.. ఫోనుల్లో ఫిర్యాదులు చేస్తున్నా అసలు పట్టించుకోకపోవడంతో ప్రస్తుత పరిస్థితి దారుణంగా తయారైంది. కొంతమంది వ్యాపారుల వల్ల అందరి వ్యాపారాలు పోతున్నాయని రైతుబజార్‌లోని మిగిలిన వ్యాపారులు సైతం ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు రైతుబజార్‌లో కొంతమంది వ్యాపారులు చేస్తున్న ఆగడాలను అదుపుచేయాలని, అధిక ధరలను నియంత్రించి, తూనికలు కొలతల శాఖా అధికారులు కూడా ఇక్కడి కాటాలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలానే రైతుబజార్‌లో నాణ్యమైన కూరగాయలు పక్కదారి పట్టకుండా ఇక్కడ కూడా వాటిని అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

**సిబ్బంది పట్టించుకోవడం లేదు**



సింగ్‌నగర్ రైతుబజార్‌లో కూరగాయలు అసలు బాగోడం లేదు. కుళ్లిపోయినవి, పాడైపోయినవి కూడా వేసేస్తున్నారు. అదేమని అడిగితే నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. బోర్డులో ఉన్న రేట్లకన్నా ఎక్కువ డబ్బులు తీసుకుంటున్నారు. ఈఓకు చెబుదామని వెళ్తుంటే ఆయన ఆఫీస్‌లో ఉండడం లేదు. పక్కన సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదు.

– ఎ.మంగతాయారు, వినియోగదారురాలు

**కేజీకి రూ.5 అదనం..**



సింగ్‌నగర్ రైతుబజార్‌లో నాసిరకం కూరగాయలను విక్రయిస్తున్నారు. అవి కూడా బోర్డులో ఉన్న ధరలకు కాకుండా కేజీకి రూ.5 అదనంగా ఇవ్వాల్సి వస్తుంది. కాటా కూడా సరిగా వేయడం లేదు. డబ్బులు పోయినా మంచివి ఇస్తున్నారా అంటే అది కూడా లేదు. దీంతో ఆ పక్క రోడ్డులో ఉన్న దుకాణాలకు వెళ్లి కేజీకి రూ.10 అదనం అయినా అక్కడే తీసుకుంటున్నాము.

– షేక్ రాబియా, వినియోగదారురాలు

### ప్రజా సమస్యలపై సత్వర పరిష్కారం చూపండి

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



నగర వాసుల ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఫిర్యాదుల పరిష్కార వేదికలో నగర ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదుకు స్పందించి సత్వర పరిష్కారం చూపాలని నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ఆయన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. నగర పరిధిలో గల వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను స్వీకరిస్తూ ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖాధిపతులను ఆయన ఆదేశించారు. ప్రజల నుంచి మొత్తం 16 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల నుంచి అందిన సమస్యలు పునరావృతం కాకుండా దగ్గర ఉండి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎస్ఈ (ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ లత, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, డెప్యూటీ డైరెక్టర్ హార్టీకల్చర్ రామ్మోహన్, బయాలజిస్ట్ సూర్యకుమార్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## సైబర్ నేరాల కట్టడికి బ్యాంకర్లు సహకరించండి



బ్యాంకు కో ఆర్డినేటర్లతో మాట్లాడుతున్న డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి

విజయవాడస్పోర్ట్స్: సైబర్ నేరాలను కట్టడి చేసేందుకు సహకరించాలని పలు బ్యాంకుల ఉద్యోగులను డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) పి.తిరుమలేశ్వరరెడ్డి కోరారు. పోలీస్ కమిషనరేట్‌లోని సమావేశపు హాల్‌లో బ్యాంకు కో ఆర్డినేటర్లతో డీసీపీ సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు వినూత్న పద్ధతులతో పోలీస్ కమిషనరేట్ ముందుకు సాగుతుందన్నారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో అధికారులుగా నటిస్తూ నకిలీ ఫోన్ కాల్స్, వీడియో కాల్స్ ద్వారా కస్టమర్లను సైబర్ నేరగాళ్లు భయభ్రాంతులకు చేస్తున్నారన్నారు. మాదక ద్రవ్యాలు, మనీ లాండరింగ్ కేసుల్లో వారి ప్రమేయం ఉన్నట్లు నమ్మించి అమాయకులను మోసం చేస్తున్నారని చెప్పారు. అపరాధ రుసుం చెల్లించమని బెదిరిస్తూ.. డబ్బులు బదిలీ చేయించుకుంటున్నారని వివరించారు.

**నేరాల నివారణకు భాగస్వాములు కావాలి**

మోసపోతున్న అమాయకులు బ్యాంకుకు వచ్చి వారి సేవింగ్స్ అకౌంట్ నుంచి ఇతర రాష్ట్రాల్లోని కరెంట్ ఖాతాలకు నగదును బదిలీ చేయాలని అడిగితే.. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా 'మీరు డబ్బును పంపాలనుకుంటున్న వ్యక్తి మీకు తెలుసా.?, డిజిటల్ అరెస్ట్ పేరుతో డబ్బు బదిలీ చేయమని ఎవరైనా మిమ్మల్ని ఒత్తిడి చేస్తున్నారా.?, సీబీఐ, కస్టమ్స్, పోలీస్ పేరుతో వీడియో కాల్ ఏమైనా వచ్చిందా.?, అని బాధితులను ప్రశ్నించాలని బ్యాంకు సిబ్బందికి సూచించారు. వీటితో పాటు అనుమానాస్పద లావాదేవీలను నిలిపివేసి పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. బెదిరింపులకు గురైన వ్యక్తి ఫోన్ స్విచ్ ఆఫ్ చేయించాలని, బాధితులతో 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయించాలని కోరారు. సైబర్ నేరాల నివారణకు బ్యాంకర్లు అందరూ భాగస్వాములు కావాలన్నారు.

### కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సీవీఆర్, పీఎస్ఆర్ మున్సిపల్ స్కూల్స్ విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు వారోత్సవాల ముగింపు సభలో బహుమతి ప్రదానం చేయనున్నట్లు గ్రంథాలయాధికారి కె రమాదేవి తెలిపారు. విద్యార్థులకు గ్రంథాలయంలోని వివిధ విభాగాలను చూపించి, పుస్తకాల ఆవశ్యకతను తెలియజేశారు. విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వం ఇచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది ధనలక్ష్మి, రమేష్ రాంబాబు, కుమార్, సుబ్బయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు వ్యాసరచన పోటీలు**

మధురానగర్(విజయవాడసెంట్రల్): కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ రామకృష్ణాపురం శాఖా గ్రంథాలయం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలన – ఆవశ్యకత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి కల్యాణి మాట్లాడుతూ.. విద్యార్థులు గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుస్తక పఠనం ద్వారా మేథస్సు పెరుగుతుందని తెలిపారు. అలాగే విద్యార్థి దశ నుంచే మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను తెలుసుకుని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంకే బేగ్ పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పీఎం స్వానిధి పథకంతో వీధి వ్యాపారులను ఆదుకోవాలి

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): వీధి వ్యాపారస్తుల ఆర్థిక స్థితిని మెరుగుపరిచేందుకు నేటి నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు ప్రధాన మంత్రి స్వానిధి యోజన పథకం క్యాంపెయిన్ నిర్వహించి వారిని ఆదుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్స్ ఆధ్వర్యంలో నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్‌పై సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఇందులో మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్స్ జాయింట్ సెక్రటరీ రాహుల్ కపూర్ మాట్లాడుతూ 15 రోజులపాటు జరిగే స్వానిధి యోజన క్యాంపైన్‌కు సంబంధించి పలు సూచనలు చేశారు. ఆ సూచనల మేరకు కమిషనర్ ధ్యానచంద్ర యూసీడీ విభాగం సిబ్బందికి పీఎం స్వానిధి యోజన పథకం ద్వారా వీధి వ్యాపారులకు కల్పించే రుణాల నిమిత్తం పాటించాల్సిన సోషియో ఎకనామిక్ ప్రొఫైలింగ్‌ను వివరించారు. ఈ క్యాంపైన్ గురించి ప్రతి వీధి వ్యాపారస్తుడికి, బ్యాంకులకు తెలియ జేయాలని చెప్పారు.

## విధుశేఖర స్వామి విశేష పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు



స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న విధుశేఖర స్వామి

విజయవాడకల్చరల్: శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విజయ యాత్ర సోమవారం రెండో రోజుకు చేరుకుంది. స్వామి ఉదయం సత్యనారాయణపురంలోని పాదుకా క్షేత్రంలో జగద్గురువు ఆదిశంకరుల విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మారుతీ వ్యాయామ శాలలోని ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక మాసం సందర్భంగా పార్వతీ పరమేశ్వర్లకు స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పీఠ సంప్రదాయాన్ని అనుసరించి స్వామి శారదా చంద్రమౌళీశ్వర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శివరామ కృష్ణ క్షేత్రం ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్, జొన్నవిత్తుల ప్రభాకర శాస్త్రి, గన్నవరం లలితాదిత్య, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ పాల్గొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వేద పండితులు చతుర్వేదాలను గానం చేశారు.

**స్వామి వారి నేటి కార్యక్రమాలు**

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారి దర్శనం, వడ్లమన్నాటి వారి సత్రం దర్శనం, లలితా దిత్య అష్టావధాన కార్యక్రమంలో భక్తులకు అనుగ్రహ భాషణం తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారు.

## నాణ్యతా ప్రమాణాలతో రహదారుల నిర్మాణం




రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రాజేశ్వరి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశించిన సమయంలో రహదారుల నిర్మాణ పనులు పూర్తి చేయాలని 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి సూచించారు. స్థానిక అల్లూరి సీతారామరాజు వంతెన సెంటర్ సమీపంలో సోమవారం రూ.19.62 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని రోడ్డు నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు వంతెన నుంచి ఏలూరు రోడ్డు వరకు రూ.19.62 లక్షలతో బీటీ రోడ్డు వేస్తున్నామన్నారు. ఇక్కడ రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా మారటంతో ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు జనరల్ ఫండ్స్ నుంచి నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో దాసాంజనేయ స్వామివారి దేవాలయం మాజీ చైర్మన్ వల్లభనేని సతీష్, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు తోట పాండు, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## మైమరిపించిన శ్రీకృష్ణ పారిజాతం నృత్య రూపకం





ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలోని కళావేదికపై సోమవారం ప్రదర్శించిన శ్రీకృష్ణ పారిజాతం నృత్య రూపకం మైమరిపించింది. నాట్యాచారిణి శుభ మరువాడ నృత్య దర్శకత్వంలో కళాకారుల నటన వారి ప్రతిభకు అద్దం పట్టింది. శ్రీకృష్ణునిగా ప్రణుషారెడ్డి, సత్యభామగా అంబికా సిద్ధాబత్తుల, రుక్మిణిగా ప్రణవి యెర్రను రెడ్డి, నారదునిగా సంధ్య పిరాళ్ల నటించి మెప్పించారు. సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు పి.లక్ష్మణరావు, కార్యదర్శి లలిత్ ప్రసాద్, కార్యదర్శి బీవీఎస్ ప్రకాష్ పాల్గొన్నారు. కళాకారులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

– విజయవాడకల్చరల్



## కిటకిటలాడిన శైవక్షేత్రాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): శివకేశవులకు ప్రీతికరమైన కార్తిక మాసం మూడో సోమవారం శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు దేవాలయాలకు చేరుకుని దీపారాధనలు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులు పోటెత్తటంతో క్యూలైన్ ద్వారా దర్శనానికి పంపించారు.



ఉభయ రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో..

**ముత్యాలంపాడులో..**

ముత్యాలంపాడు శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామి వారి దేవాలయంలో కార్తిక సోమవారం పురస్కరించుకుని స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ప్రత్యేక పూజలు అర్చనలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు దీపారాధనలు చేశారు. అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. స్వామివారికి విశేషంగా అన్నాభిషేకం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, సహస్ర లింగార్చనలు జరిగాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో దీపారాధనలు చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.



శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో స్వామి వారు

## దంత వైద్య కళాశాలకు పరికరాలు అందజేత

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని ప్రభుత్వ దంత వైద్య కళాశాలకు వి.గార్డ్ సంస్థ తమ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా రూ.11 లక్షల విలువ కలిగిన మూడు డెంటల్ చైర్‌లు, ఇతర దంత వైద్య పరికరాలు అందజేసింది. డెంటల్ చైర్‌లు, సంబంధిత పరికరాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్, స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.శివశంకర్, వి.గార్డ్ డెప్యూటీ మేనేజర్ పీకే రాజేష్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావుకు అందజేశారు.